సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
శనివారం । 5 । ఆగస్టు । 2023



ముమ్మరంగా రాగుల నాట్లు

రాగుల విత్తనాలను 90 శాతం రాయితీపై రాష్ట్ర ప్రభుత్వం అందజేయడంతో నాట్లు ఊపందుకున్నాయి. 8లో



సత్వరం స్పందన 8లో

స్పందనలో అందిన అర్జీపై పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ వెంటనే స్పందించారు. వృద్ధురాలికి వాటర్ ప్రూఫ్ కవర్ అందజేశారు.



తల్లిపాలతోనే బిడ్డకు ఆరోగ్యం

తల్లిపాలతో బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని డీటీసీవో డాక్టర్ విశ్వేశ్వరనాయుడు సూచించారు. 8లో

7న సీఎం జగన్ కూనవరం పర్యటన



కూనవరం: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈనెల 7వ తేదీ సోమవారం ఉదయం 8 గంటలకు కూనవరంలో పర్యటించనున్నారు. గోదావరి వరద ముంపు ప్రాంతాల్లో బాధితులను నేరుగా కలిసి వారి కష్ట సుఖాలను తెలుసుకుంటారని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంత ఉదయభాస్కర్ శనివారం తెలిపారు. ఈనెల 4న కూనవరంలో జరగాల్సిన సీఎం పర్యటన వాయిదా పడిన విషయం తెలిసిందే.

మేలొక్కొంటే మేలు!

- జల విద్యుత్ ఉత్పత్తిలో జోలాపుట్టు జలాశయం కీలకపాత్ర
- నిర్వహణపై దృష్టి పెడితే పది కాలాలు వెలుగులు



నీటిని కొలిచే షాంప్ వాల్ మార్గంలో పాడైన సిమెంటు దిమ్మలు



ముంచంగిపుట్టు : జిల్లాలోని జలవిద్యుత్ కేంద్రాలకు నీరందించడంలో కీలకపాత్ర పోషిస్తున్న జోలాపుట్టు జలాశయ నిర్వహణపై ఇరు రాష్ట్రాల జెన్‌కో అధికారులు దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని పలువురు సూచిస్తున్నారు. ఏడాది పొడవునా మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రానికి నీరు అందిస్తుంది. ఇక్కడ విద్యుత్ ఉత్పత్తి అనంతరం విడుదలయ్యే నీటిని సీలేరు విద్యుత్ కాంప్లెక్స్‌లోని సీలేరు, డొంకరాయి, పొల్లూరు జలవిద్యుత్ కేంద్రాలు ఉత్పత్తికి ఉపయోగిస్తాయి. ఈ ప్రాజెక్ట్‌ను 1955లో నిర్మించారు. నీటిని విడుదల చేసే పవర్ గేట్లు, టర్బైన్లు, నీటిని కొలిచే ఇరెన్ మార్గంలో రాడ్లకు తుప్పు పట్టింది. తక్షణం మరమ్మతులు చేపట్టాల్సిన అవసరం ఉంది. లేకుంటే నీటి విడుదల సమయంలో సాంకేతిక సమస్యలు తలెత్తే అవకాశం ఉందని పలువురు సూచిస్తున్నారు.

విశిష్టమైన సామర్థ్యం

జోలాపుట్టు జలాశయ నీటి సామర్థ్యం 2750 అడుగులు. ఒకే సారి ఐదు గేట్లను ఎత్తి రెండు వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేయవచ్చు. జోలాపుట్టు నుంచి దిగువున ఉన్న డుడుమ జలాశయానికి నీటిని అవసరమైన ప్రతిసారీ విడుదల చేస్తూ ఉంటారు. డుడుమ నుంచి కెనాల్ ద్వారా విద్యుత్ ఉత్పత్తికి నీటిని సరఫరా చేస్తుంటారు. విద్యుత్ ఉత్పత్తి అనంతరం విడుదల అయిన నీటితో తొలుత అప్పర్ సీలేరు వద్ద 240 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుంది. అక్కడ నుంచి ఆంధ్ర బాగస్వామ్యం మొదలై డొంకరాయి వద్ద 25 మెగావాట్లు, లోయర్ సీలేరు వద్ద 460 మెగావాట్లు విద్యుత్ ఉత్పత్తి చేసిన తరువాత గోదావరిలో కలుస్తుంది.

అత్యవసరంగా చేపట్టాల్సినవి

- నీటిని విడుదల చేసే మార్గంలో షాంప్ వాల్‌తో పాటు నీటి విడుదల చేసే నాలుగు గేట్లకు అత్యవసరంగా మరమ్మతులు చేపట్టాలి.
- నీటి మట్టం కొలిచేందుకు వెళ్లే షాంప్ వాల్ మార్గంలో దెబ్బతిన్న సిమెంట్ దిమ్మలను పునరుద్ధరించాలి.
- ప్రాజెక్ట్ రక్షణ నిమిత్తం డ్యామ్ దిగువున ఏర్పాటు చేసిన సెక్యూరిటీ హౌస్ చుట్టూ తుప్పలు తొలగించి వినియోగంలోకి తేవాలి.
- డ్యామ్‌పై శిథిలావస్థకు చేరిన విద్యుత్ స్తంభాలు, దీపాల వ్యవస్థను పునరుద్ధరించాల్సిన అవసరం ఉంది.

జలాశయం వివరాలు

ప్రాజెక్ట్ గర్భం	: 24 వేల ఎకరాలు
గ్రామాలు	: 238
ఒడిశా పరిధి (156 గ్రామాలు)	: 18,200 ఎకరాలు
ఆంధ్రా పరిధి (82 గ్రామాలు)	: 5,800 ఎకరాలు



తుప్పు పట్టిన యంత్రం

ఐటీడీఏ స్పందనకు వినతుల వెల్లువ

65 అర్జీల స్వీకరణ



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న జాయింట్ కలెక్టర్ శివశ్రీనివాస్, ఐటీడీఏ పీవో అభిషేక్

సాక్షి,పాడేరు: స్థానిక ఐటీడీఏలో శుక్రవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి వ్యక్తిగత, సామాజిక సమస్యలపై 65 వినతులను స్వీకరించారు. జాయింట్ కలెక్టర్ శివశ్రీనివాస్,ఐటీడీఏ పీవో అభిషేక్ స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు.అన్నిశాఖల అధికారులు హాజరయ్యారు. తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను జాయింట్ కలెక్టర్, పీవో ఆదేశించారు. డీఆర్వో అంబేద్కర్, ఎస్‌డీసీ శర్మ,ప లు ఇంజనీరింగ్‌శాఖల ఈఈలు డీవీఆర్ఎం రాజు,కొండయ్యపడాల్,లావణ్యకుమార్,ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి, డీఎల్పీవో కుమార్ తదితరులు పాల్గొన్నారు

- జీకేవీధి మండలం యర్రవరం గిరిజనులు పూర్ణయ్య, రాధిక, ప్రసాద్ సాగు చేస్తున్న అటవీ భూములకు ఆర్వోఎఫ్ఆర్ పట్టాలు మంజూరు చేయాలని కోరారు.
- జి.కే.వీధి మండలం పూజారిపాకలు గ్రామానికి చెందిన తగ్గె బాలయ్య తన భూమిని కొందరు అక్రమించి ఇళ్లు కట్టుకున్నారని, సర్వే జరిపి తనకు న్యాయం చేయాలని వినతిపత్రం అందజేశారు
- అరకులోయ మండలం ముసిరిగుడ గ్రామానికి చెందిన చెట్టి స్వామి భూముల సర్వే జరిపి న్యాయం చేయాలని అర్జీ అందజేశారు.
- గతనెలలో కురిసిన భారీ వర్షాలకు ఇళ్లు ధ్వంసమైందని, నష్ట పరిహారం మంజూరుచేయాలని పెదబయలు మండలం గుల్లెలు పంచాయతీ బోయరాజులు గ్రామానికి చెందిన కె.చిన్నయ్య కోరాడు.
- చింతపల్లి మండలం లబ్బంగికొత్తూరు గ్రామానికి చెందిన కేదారి వెంకటస్వామి తనకు చెందిన భూమిని బొరంగి మీనాక్షి అక్రమించిందని, ఆమె భూ రిజిస్ట్రేషన్ నిలిపివేసి న్యాయం చేయాలని విన్నవించాడు.
- జి.కే.వీధి మండలం లక్కవరపుపేట పంచాయతీ కిన్నెర్లబంద గ్రామంలో తాగునీటి సదుపాయాలు కల్పించాలని గెమ్మెలి జగ్గారావు,పాంగి మహేష్ కోరారు.

వ్యాధులు ప్రబలకుండా చర్యలు

సబ్ కలెక్టర్ శుభం బన్సల్

కూనవరం: వరద ముంపు గ్రామాల్లో అంటువ్యాధులు ప్రబల కుండా జాగ్రత్తలు తీసుకోవాలని రంపచోడవరం సబ్‌కలెక్టర్ శుభం బాన్సల్ ఆదేశించారు. మండల పరిధిలోని కూటూరులో ఏర్పాటు చేసిన వైద్యశిబిరాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. వైద్యులకు పలు సూచనలు చేశారు. జ్వరాలు ఉన్నట్లు నిర్ధారణ అయితే వెంటనే వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేయాలని ఆదేశించారు. చౌకదుకాణాలను పరిశీలించారు. వరద బాధితులతో మాట్లాడారు. కూరగాయలు అందినదీ లేనిది వారి నుంచి తెలుసుకున్నారు.



కూటూరులో వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ శుభం బన్సల్

న్యూస్‌రీల్

క్రీడా పాఠశాలలో ప్రవేశాలకు ఎంపిక పోటీలు



ఎంపిక పోటీలను ప్రారంభిస్తున్న ట్రైబల్ వెల్ఫేర్ క్రీడాధికారి శ్యామ్‌సుందర్

అరకులోయ రూరల్: క్రీడా పాఠశాలలో ప్రవేశాలకు సంబంధించి ఎంపిక పోటీలు స్థానిక క్రీడా పాఠశాలలో శుక్రవారం ప్రారంభమయ్యాయి. వీటిని ట్రైబల్ వెల్ఫేర్ క్రీడా అధికారి శ్యామ్‌సుందర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023–24 విద్యాసంవత్సరానికి సంబంధించి 5వ తరగతిలో ఖాళీగా ఉన్న 30 సీట్లకు 54 మంది విద్యార్థులు ఎంపిక పోటీల్లో పాల్గొన్నారన్నారు. ఈ కార్యక్రమంలో ట్రైబల్ వెల్ఫేర్ అకాడమి మానటరింగ్ అధికారి రఘునాథ్, క్రీడా పాఠశాల ప్రిన్సిపాల్ పీఎస్ఎన్ మూర్తి, పీడీలు లక్ష్మణమూర్తి, సత్యనారాయణ, సునీల్‌బాబు, వెంకటరెడ్డి, కోచ్‌లు గణపతి, రాజుబాబు, మాధవ్, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ బాధిత కుటుంబానికి తక్షణ సాయం

- కలెక్టర్ సుమిత్‌కుమార్



జీడిగుప్ప ఆర్‌అండ్ఆర్ కాలనీవాసులతో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

వీఆర్‌పురం : వరదల్లో ఇబ్బందులు పడిన ప్రతీ బాధిత కుటుంబానికి ప్రభుత్వం నుంచి తక్షణ సాయంగా రూ.2 వేలు అందజేశామని కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన వీఆర్‌పురం మండలంలోని పోలవరం ముంపు గ్రామాలైన జీడిగుప్ప, కన్నాయిగూడెంకు చెందిన ఆర్‌అండ్ఆర్ కాలనీల్లో పర్యటించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతీ బాధిత కుటుంబానికి 25 కేజీల బియ్యం, కురగాయలు, నూనె, పాలు, అవసరం మేరకు టార్పాలిన్లు అందజేశామన్నారు. కాలనీల్లో అంతర్గత రహదారులు నిర్మించాలని, తాగునీటి సౌకర్యం కల్పించాలని విన్నవించారు. సమస్యలను సకాలంలో పరిష్కరించేందుకు తగు చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు. తహసీల్దార్ ఎన్.శ్రీధర్ ,రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

గోదావరిలో పడి రైతు మృతి



వీరవెంకట్రావు (ఫైల్)

ఎటపాక: ప్రమాదవశాత్తూ గోదావరిలోపడి ఓ రైతు మృతి చెందిన ఘటన మండలంలోని గొరిదేవిపేటలో శుక్రవారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మేతకు వెళ్లిన పశువులు ఇంటికి రాకపోవడంతో వాటిని వెతికేందుకు గ్రామానికి చెందిన బొమ్మగాని వీరవెంకటరావు (46) గోదావరి ఒడ్డుకు సాయంత్రం వెళ్లాడు. చీకటి పడుతున్నా అతను ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు నదీ తీరం వెంబడి వెతికారు. ఈ క్రమంలో నది ఒడ్డున మునిగి ఉన్న అతనిని వెంటనే బయటకు తీశారు. అప్పటికే మృతి చెందడంతో పోలీసులకు సమాచారం అందజేశారు. వీరవెంకట్రావు మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

మోదమ్మను దర్శించుకున్న ఏలూరు కలెక్టర్



ప్రసన్న వెంకటేష్ దంపతులకు అమ్మవారి ఫొటోను అందజేస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

సాక్షి, పాడేరు: ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్యదైవం పాడేరు మోదకొండమ్మతల్లిని ఏలూరు కలెక్టర్, గత పాడేరు సబ్‌కలెక్టర్ ప్రసన్నవెంకటేష్ సతీసమేతంగా శుక్రవారం దర్శించుకున్నారు. వీరికి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అర్చకుడు సుబ్రహ్మణ్యం పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం ప్రసన్న వెంకటేష్ దంపతులను తహసీల్దార్ త్రినాథనాయుడు,ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కొట్టగుల్లి సింహాచలంనాయుడు ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. మోదకొండమ్మతల్లి చిత్రపటంతో పాటు ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో వెంకటలక్ష్మి, ఐటీడీఏ ప్రొటోకాల్ అధికారి సుబ్రహ్మణ్యం, అరకు ఎమ్మెల్యే సీసీ రమణ, వాసవీ క్లబ్ ప్రతినిధులు ఉప్పల వెంకటరత్నం, శ్రీనాథు శ్రీనివాసరావు,ఆలయ కమిటీ ప్రతినిధి కొట్టగుల్లి రామారావు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల చెంతకు బాలికలు

మహిళ నుంచి రక్షించిన పోలీసులు

మారేడుమిల్లి: ఓ మహిళ ఉచ్చులో చిక్కుకున్న ముగ్గురు బాలికలను స్థానిక పోలీసులు పట్టుకుని వారి తల్లిదండ్రులకు అప్పగించారు. ఎస్ఐ రాము కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గుజ్జుమామిడి వలస గ్రామానికి చెందిన సూరబోయిన సుబ్బలక్ష్మి కుమార్తె స్థానిక బాలికల వసతి గృహంలో ఉంటూ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ఫస్ట్ ఇయర్‌చదువుతోంది. ఈనెల 2న సుబ్బలక్ష్మి తన కుమార్తెను చూసేందుకు కళాశాలకు వెళ్లింది. కుమార్తె అక్కడ కనిపించలేదు. కళాశాలకు రాలేదని అక్కడి వారు తెలిపారు. హాస్టల్‌లో కూడా లేకపోవడంతో ఆమె మిగతా విద్యార్థినులను వాకబు చేసింది. ఆమె కుమార్తెతో పాటు అదే కళాశాలకు చెందిన మరో ఇద్దరు బాలికలు కూడా కనిపించకపోవడం వెలుగుచూసింది. దీంతో చుట్టుపక్కల గ్రామాల్లో, బంధువులు ఇళ్ల వద్ద గాలించారు. ఈ ముగ్గురు బాలికల్లో ఒకరి బంధువైన రంపచోడవరం మండలం కాకవాడ గ్రామానికి చెందిన కొమరం ఉమాభారతి అనే మహిళ.. ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మించి వారిని తీసుకెళ్లినట్టు సుబ్బలక్ష్మి తెలుసుకుంది. మారేడుమిల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టిన పోలీసులు గోకవరం గ్రామం వద్ద బాలికలను గుర్తించి, మారేడుమిల్లి తీసుకువచ్చి శుక్రవారం తల్లిదండ్రులకు అప్పగించారు. నిందితురాలిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్టు ఎస్ఐ రాము తెలిపారు.

వరద బాధితులకు పూర్తిస్థాయిలో సేవలు



ములకపల్లిలో పర్యటిస్తున్న పీవో సూరజ్‌గనోరే

వీఆర్ పురం: సచివాలయ, రెవెన్యూ సిబ్బంది పరస్పర సహకారంతో పనిచేసి వరద బాధితులకు సేవలందించాలని చింతూరు ఐటీడీఏ పీఓ సూరజ్ గనోరే అన్నారు. మండలంలోని వరద ప్రభావిత గ్రామాల్లో ఆయన శుక్రవారం పర్యటించి బాధితులను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కొండలు, గుట్టలు దాటి కాలినడకన గ్రామాలకు చేరుకున్నారు. తొలుత జీడిగుప్ప పంచాయతీ పరిధిలోని ములకపల్లి గ్రామంలో పర్యటించి పారిశుధ్య పనులపై సిబ్బందిని ఆరా తీశారు. ప్రభుత్వం ద్వారా అందిస్తున్న తక్షణ సాయం రూ. 2 వేల నగదు, నిత్యావసర సరకుల పంపిణీ గురించి వరద బాధితులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పోచవరం గ్రామాన్ని కూడా సందర్శించారు.

నులిపురుగుల నివారణే లక్ష్యం

- కలెక్టర్ సుమిత్‌కుమార్
- పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, డీఎంహెచ్‌వో జమాల్‌బాషా



గోడ పత్రికలను ఆవిష్కరిస్తున్న జాయింట్ కలెక్టర్ శివ శ్రీనివాస్, ఐటీడీఏ పీవో అభిషేక్

చింతూరు: వైద్య ఆరోగ్యశాఖ ఈనెల 10న నిర్వహించనున్న జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ కోరారు. శుక్రవారం చింతూరు ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఒకటి నుంచి 19 సంవత్సరాలలోపు బాల బాలికలకు నులిపురుగుల మాత్రలు తప్పనిసరిగా వేయాలని సూచించారు. పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈనెల 10న నులిపురుగుల మాత్రలు ఉచితంగా ఇస్తారని ఆయన తెలిపారు. డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ జమాల్‌బాషా మాట్లాడుతూ పిల్లల్లో నులిపురుగులు సంక్రమించకుండా ఉండేందుకు క్షేత్రస్థాయి సిబ్బంది కృషి చేయాలని సూచించారు. పిల్లలు చేతులు శుభ్రపరచుకునేలా, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకునేలా అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ పుల్లయ్య, తులసిపాక వైద్యాధికారి ఉదయ్, సిబ్బంది పాల్గొన్నారు.

పాడేరు రూరల్ : జిల్లా వ్యాప్తంగా ఈనెల 10వ తేదీన జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమం పక్కాగా అమలు చేయాలని జాయింట్ కలెక్టర్ శివ శ్రీనివాస్, ఐటీడీఏ పీవో అభిషేక్ ఆదేశించారు. రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమంలో భాగంగా జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమంపై రూపొందించిన పోస్టర్లను శుక్రవారం ఐటీడీఏ సమావేశ మందిరంలో వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పీవో అభిషేక్ మాట్లాడుతూ పిల్లలకు నులి పురుగుల మాత్రల వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించాలని వైద్యారోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. ఒకటి నుండి ఐదేళ్లలోపు పిల్లలకు అంగన్‌వాడీ కేంద్రాల్లోనూ, ఆరేళ్ల నుంచి 19ఏళ్ల పిల్లలకు, కిశోర బాలికలకు పాఠశాలలు, కళాశాలల్లో నులి పురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో అంబేడ్కర్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వీవీఎస్ శర్మ, ఐసీడీఎస్ పీడీ సూర్యకళ, ఐటీడీఏ ఏవో హేమలత, వైద్యారోగ్య శాఖ అధికారులు పాల్గొన్నారు.

వై.రామవరం సీహెచ్‌సీ డీసీహెచ్‌ఎస్ సందర్శన



వై.రామవరం సీహెచ్‌సీలో సిబ్బందికి సలహాలు సూచనలు ఇస్తున్న డీసీహెచ్‌ఎస్ కృష్ణారావు

వై.రామవరం: స్థానిక సీహెచ్‌సీని డీసీహెచ్‌ఎస్ డాక్టర్ కృష్ణారావు శుక్రవారం సందర్శించారు. రికార్డులను, ఆసుపత్రిలోని అన్ని విభాగాలను తనిఖీ చేశారు. ఆస్పత్రిలో ఉన్న సౌకర్యాలను పరిశీలించారు. సమస్యలు తెలుసుకున్నారు. మందుల నిల్వలను తనిఖీ చేశారు. ఆస్పత్రిలో సేవలపై రోగుల నుంచి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యసేవలు అందుతున్నాయని వారు బదులివ్వడంతో వైద్యుల పనితీరు పట్ల డీసీహెచ్ సంతృప్తి వ్యక్తం చేశారు. ఆస్పత్రి వైద్యాధికారులు డాక్టర్ చైతన్య, జీవన్, మధులతసిబ్బంది పాల్గొన్నారు.

చిన్నాన్నను హత్యచేసిన యువకుడు



నిందితుడితో సీఐ రమేష్

చింతపల్లిరూరల్: తల్లితో వివాహేతర సంబంధం పెట్టుకోవడంతో పాటు తరచూ తల్లిని, తనను కొడుతున్నాడన్న ఆగ్రహంతో ఓ యువకుడు తన చిన్నాన్నను హతమార్చిన సంఘటన చింతపల్లి మండలం అంజలి శనివారం పంచాయతీ బుసులుకోట గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. స్థానిక సీఐ రమేష్ శుక్రవారం తెలిపిన వివరాలు.. బుసులుకోటకు చెందిన సాకేరి బాలరాజు(47) భార్య గతంలో మృతిచెందింది. అన్నయ్య కూడా చనిపోయాడు. అన్న భార్యతో బాలరాజు వివాహేతర సంబంధం పెట్టుకుని సహజీవనం చేస్తున్నాడు. బాలరాజు తరచూ మద్యం తాగి తన వదినను, ఆమె కుమారుడు సాకేరి లోవరాజు(25)ను కొట్టడం,తిట్టడం చేస్తున్నాడు. బుసులుకోటలోని తమ పొలంలో పనిచేసుకుంటున్న లోవరాజు, అతని తల్లిని.. బాలరాజు బుధవారం కొట్టాడు. అప్పటికే వివాహేతర సంబంధం కారణంగా చిన్నాన్న బాలరాజుపై పగ పెంచుకున్న లోవరాజు కత్తితో అతని మెడ,ఛాతీపై నరికాడు. దీంతో బాలరాజు అక్కడిక్కడే మృతి చెందాడు. పొలం పక్కనే గొయ్యితీసి బాలరాజు మృతదేహాన్ని పూడ్చిపెట్టారు. తర్వాత వీఆర్వోకు ఈ విషయం తెలిపి, శుక్రవారం పోలీసుల ఎదుట లోవరాజు లొంగిపోయినట్టు సీఐ తెలిపారు. స్థానిక డిప్యూటీ తహసీల్దార్ రాజ్‌కుమార్ సమక్షంలో మృతదేహాన్ని వెలికితీసి పంచనామా నిర్వహించినట్టు ఆయన చెప్పారు. నిందితుడిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించామని సీఐ తెలిపారు.

మన్యం సిగలో దాలియా





బరిసింగి ప్రాంతంలో గిరిజనుల క్షేత్రంలో కనువిందు చేస్తున్న దాలియా పూలు

- మార్కెట్లో అమ్మకాలు ప్రారంభం
- శ్రావణమాసం కావడంతో మంచి ధర

సాక్షి,పాడేరు: రంగు రంగుల దాలియా పూలు మార్కెట్లో కనువిందు చేస్తున్నాయి. దిగుబడి ప్రారంభం కావడంతో గిరి రైతులు విక్రయాలకు తీసుకువస్తున్నారు. వారం రోజులుగా స్థానిక మార్కెట్లో అమ్మకాలు జరుపుతున్నారు. శ్రావణమాసం కావడంతో పూలకు మంచి ధర లభిస్తోంది. మంగళవారం బుట్ట పూలు రూ.300కు వ్యాపారులు కొనుగోలు చేశారు. పాడేరు, హుకుంపేట మండలాల్లోని బరిసింగి, దోకులూరు,గుత్తులపుట్టు, డి.గొందూరు, మఠం, శోభకోట, సూకూరు, బారామోసి,ములియాపుట్టు పంచాయతీలు దాలియా పూల సాగుకు గుర్తింపు పొందాయి. శ్రావణం, కార్తీక మాసాల్లో దాలియా పూలకు మైదాన ప్రాంతాల్లో మంచి డిమాండ్ ఉంది. ఈ ఏడాది ముందుకు బరిసింగి ప్రాంతంలో పూల దిగుబడి ప్రారంభమైంది.



డోలీలో గర్భిణి తరలింపు

అటవీ మార్గంలో మోసుకుని వచ్చిన వలంటీర్ సుబ్బారావు

ముంచంగిపుట్టు: పురిటినొప్పులతో బాధపడుతున్న గర్భిణిని గ్రామ వలంటీర్ సకాలంలో డోలీలో ఆస్పత్రికి తరలించి ప్రాణాపాయ స్థితి నుంచి కాపాడాడు. మండలంలోని మారుమూల లక్ష్మీపురం పంచాయతీ ఉబ్బెంగులలో గురువారం అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో గర్భిణి వంతాల బసంతి(19)కి పురిటినొప్పులు మొదలయ్యాయి. గ్రామం చుట్టూ ఉన్న గెడ్డ పొంగి ప్రవహిస్తుండటం వల్ల ఆమెను ఆస్పత్రికి ఎలా తరలించాలని అనేదానాపిఐ కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. ఈ సమయంలో గ్రామ వలంటీర్ వంతాల సుబ్బారావు అటవీ మార్గంలో డోలీలో తరలించేందుకు సాహసించాడు. గ్రామస్తులు, కుటుంబ సభ్యుల సహకారంతో సుమారు ఐదు కిలోమీటర్ల దూరం మేర ఆమెను డోలీలో మోసుకొని కొండలు, గుట్టలు దాటుకుని సుత్తిగూడ వరకు తీసుకువచ్చాడు. అక్కడి నుంచి అంబులెన్సులో స్థానిక ఏరియా ఆస్పత్రికి సకాలంలో తీసుకువచ్చి చేర్పించాడు. దీంతో గర్భిణి ప్రాణాపాయ స్థితి నుంచి బయట పడింది. సాహసించి డోలీలో తీసుకువచ్చిన వలంటీర్ సుబ్బారావును సర్పంచ్ త్రినాథ్, గ్రామస్తులు అభినందించారు. ప్రభుత్వం స్పందించి ఉబ్బెంగుల గ్రామానికి రహదారి సౌకర్యం కల్పించాలని, గెడ్డపై వంతెన నిర్మించాలని వారు కోరారు.



గర్భిణి బసంతిని డోలీలో తరలిస్తున్న వలంటీర్ సుబ్బారావు

క్లుప్తంగా

సత్వరం స్పందన

● వృద్ధురాలికి వాటర్ ప్రూఫ్ కవర్ అందజేత

సాక్షి,పాడేరు: హుకుంపేటకు చెందిన చెందిన వృద్ధురాలు ఎస్.రత్నమ్మకు ఇంటి పైకప్పునకు సంబంధించి వాటర్ ప్రూఫ్ కవర్‌ను ఐటీడీఏ పీవో అభిషేక్, జాయింట్ కలెక్టర్ శివ శ్రీనివాస్ శుక్రవారం అందజేశారు. వర్షాలకు ఇల్లు కారిపోతున్నందున వాటర్ ప్రూఫ్ కవర్ లేదా టార్పాలిన్ అందజేయాలని ఆమె గత స్పందనలో వినతిపత్రం అందజేసింది. దీనిపై స్పందించిన ఐటీడీఏ పీవో అభిషేక్ వాటర్ ప్రూఫ్ కవర్‌ను ఐటీడీఏ నిధులతో కొనుగోలు చేశారు. శుక్రవారం వృద్ధురాలిని ఐటీడీఏ సమావేశమందిరానికి రప్పించి అందజేశారు.

నేటి నుంచి తల్లిపాల వారోత్సవాలు

పాడేరు రూరల్: స్థానిక ఐటీడీఏలో శనివారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలను పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి ప్రారంభిస్తారని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం సిబ్బంది శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా ఉదయం 11గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి నామినేటెడ్ పదవుల్లో ఉన్న నేతలు, స్థానిక ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు తప్పనిసరిగా హాజరుకావాలని వారు కోరారు.

పశువులకు ఎల్ఎస్‌డీ వ్యాక్సిన్



పశువులకు వ్యాక్సిన్ వేస్తున్న సిబ్బంది

రాజవొమ్మంగి: మండలంలోని శరభవరం, కింద్ర గ్రామాల్లో శుక్రవారం నిర్వహించిన వైద్య శిబిరాల్లో 300 తెల్లజాతి పశువులకు ఎల్ఎస్‌డీ (లంపీ స్కిన్ డిసీజ్) నివారణ వ్యాక్సిన్ వేసినట్టు పశువైద్యాధికారి తరుణ్ తెలిపారు. మండలానికి 7వేల డోసుల వ్యాక్సిన్‌ను ప్రభుత్వం సరఫరా చేయగా దశల వారీగా గ్రామాల్లో ఈ వ్యాక్సిన్ పంపిణీ చేస్తున్నామన్నారు.

టెక్నాలజీని అందిపుచ్చుకోవాలి



విద్యార్థినికి ఉద్యోగ నియామక పత్రాన్ని అందజేస్తున్న కమిషనర్ నాగరాణి

మురళీనగర్ (విశాఖ ఉత్తర): మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా మనం మారాలని రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ సి.నాగరాణి చెప్పారు. విశాఖ పర్యటనలో భాగంగా ఆమె కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీని శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా సిబ్బందితో సమావేశమయ్యారు. ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం సాంకేతిక విభాగంలో అనేక విప్లవాత్మక మార్పులు వచ్చాయన్నారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంచుకునే విధంగా తర్ఫీదు ఇవ్వాల్సి ఉందన్నారు. ఇండస్ట్రియల్ కనెక్టెడ్ కోర్సులను నేర్చుకునే విధంగా విద్యార్థులను ప్రోత్సహించాలని చెప్పారు. ప్రస్తుతం ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, మెకట్రానిక్స్, రోబోటిక్స్, ఏఆర్‌వీఆర్, సీఏన్‌సీ, డ్రోన్ టెక్నాలజీ వంటి కోర్సులు చేసిన వారికి మంచి ఉపాధి అవకాశాలు ఉన్నాయని ఆమె వివరించారు. సంప్రదాయ కోర్సులతో పాటు ఉపాధి అవకాశాలు పెంచే కోర్సులకు ప్రాధాన్యతనివ్వాలన్నారు.

క్యాంపస్ ఇంటర్వ్యూలకు ప్రాధాన్యత

ఈ ఏడాది కూడా పరిశ్రమల అవసరాలను తీర్చే విధంగా ఎక్కువ మంది ఉద్యోగాల్లో చేరేందుకు విద్యార్థులకు తర్ఫీదు ఇవ్వాలన్నారు. అవసరమైన పరిజ్ఞానాన్ని అందించే విధంగా శిక్షణ నివ్వాలన్నారు. కెరీర్ గైడెన్స్ ఇవ్వాలన్నారు. పాలిటెక్నిక్ కోర్సు పూర్తికాగానే వంద శాతం మంది విద్యార్థులు ఉద్యోగాలు పొందే విధంగా కృషి జరగాలన్నారు. కంపెనీలతో ఎంవోయూలు చేసుకోవడంతో పాటు వారితో నిరంతరం సంబంధాలు కొనసాగిస్తూ సమన్వయంతో పనిచేయాలన్నారు. కాలేజీ సిబ్బంది వారి బ్రాంచ్‌లకు సంబంధించిన ఆధునిక పోకడలను తెలుసుకుంటూ విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంచే విధంగా నూతన ప్రాజెక్టులు రూపొందించేందుకు కృషి చేయాలన్నారు. నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రిడిటేషన్‌కు (ఎన్‌బీఏ) విశాఖ నగరం నుంచి అన్ని పాలిటెక్నిక్ కాలేజీలు చెందిన అన్ని బ్రాంచ్‌లు గుర్తింపు పొందాలన్నారు. రాష్ట్రంలో ఇప్పటివరకు ఆముదాలవలస, శ్రీకాకుళం, అనకాపల్లి, విజయవాడ, గన్నవరం, కుప్పం, కళ్యాణ దుర్గం ప్రభుత్వ పాలిటెక్నిక్‌లకు ఎన్‌బీఏ గుర్తింపు పొందినట్లు చెప్పారు. ఇతర కాలేజీలు కూడా ఎన్‌బీఏ గుర్తింపు పొందే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. విశాఖపట్నం పాలిటెక్నిక్ కాలేజీ కూడా ఎన్‌బీఏ గుర్తింపునకు వెంటనే వెళ్లాలని ఆమె ఆదేశించారు. ఈ సందర్భంగా ఇటీవల బిర్లా కంపెనీలో ఉద్యోగాలు పొందిన ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీ (గైస్) బాలికలకు నియామకపత్రాలను ఆమె అందించారు. సాంకేతిక విద్యాశాఖ ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ విభాగం డీడీ డాక్టర్ రామకృష్ణ, పాలిటెక్నిక్ కాలేజీ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ నరసింహారావు, కంచరపాలెం కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ పాల్గొన్నారు. సెమ్స్‌ను సందర్శించి శిక్షణ పొందుతున్న విద్యార్థులతో మాట్లాడారు. మెకట్రానిక్స్, రోబోటిక్స్, ఏఆర్‌వీఆర్, సీఎన్‌సీ కోర్సులల్లో జరుగుతున్న తరగతులను, ల్యాబరేటరీలను ఆమె పరిశీలించారు.

‘అమృత భారత్’తో రైల్వేస్టేషన్ల అభివృద్ధి

- దువ్వాడ స్టేషన్ ఆధునికీకరణకు రేపు భూమిపూజ
- వర్చువల్ విధానంలో ప్రధాని మోదీ శ్రీకారం
- డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్



వివరాలు తెలియజేస్తున్న డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్

తాటిచెట్లపాలెం(విశాఖ ఉత్తర): అమృత భారత్ పథకం కింద దేశ వ్యాప్తంగా పలు రైల్వే స్టేషన్లను అభివృద్ధి చేసేందుకు భారతీయ రైల్వే శ్రీకారం చుట్టిందని వాల్తేర్ డివిజన్, డివిజనల్ రైల్వే మేనేజర్ సౌరభ్ ప్రసాద్ తెలిపారు. దొండపర్తిలోని డీఆర్ఎం కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. దేశ వ్యాప్తంగా ఎంపిక చేసిన 1309 స్టేషన్లను అభివృద్ధి చేయాలని నిర్ణయించిందన్నారు. వీటిలో పలు స్టేషన్లకు సంబంధించి ఆధునికీకరణ పనులకు ప్రధాని మోదీ ఆదివారం వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేయనున్నట్టు ఆయన తెలిపారు. ఈస్ట్‌కోస్ట్ రైల్వే జోన్ పరిధిలో 25 స్టేషన్‌లు ఎంపిక కాగా, వీటిలో వాల్తేర్ డివిజన్ పరిధిలో మొత్తం 15 స్టేషన్‌లు ఉన్నాయని చెప్పారు. వాల్తేర్ డివిజన్ పరిధిలో విజయనగరం జంక్షన్, శ్రీకాకుళం రోడ్, దువ్వాడ, బొబ్బిలి జంక్షన్, జగదల్‌పూర్, సింహాచలం, పార్వతీపురం, చీపురపల్లి, జైపూర్, నౌపడ జంక్షన్, దమన్‌జోడి, అరకు, కోరాపుట్, కొత్తవలస, పర్లాకిమిడి స్టేషన్‌లు ఎంపికయ్యాయన్నారు. వీటిలో దువ్వాడ, విజయనగరం, దమన్‌జోడీ స్టేషన్లకు ఆదివారం ఉదయం ప్రధాని మోదీ వర్చువల్ పద్ధతిలో భూమి పూజ చేస్తారని డీఆర్ఎం తెలిపారు. దువ్వాడ స్టేషన్‌ను రూ.26.31కోట్లు, విజయనగరం స్టేషన్‌ను రూ.35.16కోట్లు, దమన్‌జోడీ స్టేషన్‌ను రూ.13.93 కోట్లతో అభివృద్ధి చేస్తామన్నారు.

ఎంపికైన స్టేషన్లలో అభివృద్ధి ఇలా..

- ఈ స్టేషన్లను సిటీ సెంటర్స్‌గా అభివృద్ధి చేస్తారు.
- స్టేషన్లకు రెండు వైపులా ప్రవేశ ద్వారాలు ఏర్పాటు చేస్తారు.
- స్టేషన్ భవనాల అభివృద్ధి, పునర్నిర్మాణానికి చర్యలు
- అత్యంత ఆధునికతతో కూడిన సదుపాయాల కల్పన
- ప్రయాణికులకు సమాచారం తెలియజేసే సిస్టంలను ఆధునికంగా, ఒకే రకంగా ఏర్పాటు చేస్తారు.
- ల్యాండ్ స్కేపింగ్, స్థానిక కళలు, సాహిత్యం వంటి వాటిని ప్రదర్శిస్తారు.

8న పాడేరులో మినీ జాబ్ మేళా

ఐటీడీఏ పీవో అభిషేక్

పాడేరు రూరల్ : ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కల్పన కార్యాలయం, సీడాప్ సంయుక్తంగా పాడేరు జీఎంఆర్ పాల్‌టెక్నిక్ కళాశాలలో ఈనెల 8న మినీ జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఐటీడీఏ పీవో వి. అభిషేక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అపోలో టైర్ల కంపెనీలో ట్రైనీ పోస్టులకు సంబంధించి 2019–2023లో మెకానికల్, ఈసీఈ, ఈఈఈ డిప్లమో కోర్సులు పూర్తి చేసిన వారికి అవకాశం కల్పిస్తారని పేర్కొన్నారు. నెలకు రూ.19,950 వేతనం చెల్లిస్తారని చెప్పారు. ఎంపికైన అభ్యర్థులు తిరుపతిలోని తుడా శ్రీ సిటీలో పని చేయాల్సి ఉంటుందన్నారు. అభ్యర్థులు 18 నుండి 23 ఏళ్ల మధ్య వయసు కలిగి ఉండాలన్నారు. అపోలో ఫార్మసీలో ఫార్మసిస్ట్, రిటైల్ ట్రైనీ అసోసియేటట్, ఫార్మా అసిస్టెంట్ ఉద్యోగాలకు టెన్త్, ఇంటర్, డిగ్రీ, బీ ఫార్మసీ, డీ ఫార్మసీ, ఎం ఫార్మసీ ఉత్తీర్ణులై ఉండాలన్నారు. అభ్యర్థులు 18 నుంచి 30 ఏళ్ల వయసు ఉండాలని సూచించారు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.15వేల వేతనం చెల్లిస్తారన్నారు. అర్హత ఉండి ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 8న ఉదయం 10 గంటలకు పాడేరు జీఎంఆర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల వద్ద హాజరుకావాలన్నారు. ఇంటర్వ్యూలకు హాజరయ్యే అభ్యర్థులు ఆధార్, పాన్ కార్డులు, విద్యార్హత ధ్రువపత్రాల జెరాక్స్ కాపీలు వెంట తెచ్చుకోవాలన్నారు. పూర్తి వివరాలకు జాబ్‌మేళా సమన్వయకర్త ఆనంద్‌బాబును 6304634447 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

ముమ్మరంగా రాగుల నాట్లు



చోడినాట్లు వేస్తున్న గిరిజనులు

సాక్షి,పాడేరు: జిల్లాలో రాగుల నాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఈ సాగును ప్రోత్సహించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం 90శాతం రాయితీపై 295 క్వింటాళ్ల విత్తనాన్ని రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు పంపిణీ చేసింది. వీటితోపాటు రైతుల వద్ద ఉన్న సంప్రదాయ విత్తనాలను రైతులు వినియోగించారు. వీటితో చేపట్టిన నారుతో రైతులు నాట్లు వేస్తున్నారు. గతేడాది ఖరీఫ్‌లో 16,500 హెక్టార్లలో రాగుల సాగు చేపట్టగా, ఈ ఏడాది 19 వేల హెక్టార్లలో సాగు చేపట్టాలని వ్యవసాయశాఖ లక్ష్యంగా పెట్టుకుంది. వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉండటంతో చింతూరు డివిజన్‌లో మినహా మిగిలిన 18 మండలాల్లో రాగులు నాట్లు చురుగ్గా జరుగుతున్నాయి. అరకులోయ, డుంబ్రిగుడ, హుకుంపేట ,ముంచంగిపుట్టు, పాడేరు, జి.మాడుగుల, చింతపల్లి మండలాల్లోని గిరిజన రైతులు సేంద్రియ విధానంలో సాగు చేస్తున్నారు. ఇందుకు అవసరమైన సహకారాన్ని చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు అందిస్తున్నారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయాధికారి నందు మాట్లాడుతూ ఈ ఏడాది అదనంగా అదనంగా 2500 హెక్టార్లలో సాగు చేపట్టాలన్న లక్ష్యంగా చర్యలు చేపట్టామని చెప్పారు.

సికిల్‌సెల్ ఎనీమియా బాధితులకు అండగా ప్రభుత్వం



వనుగుమ్మలో సికిల్‌సెల్ ఎనీమియా బాధితుడికి పింఛన్ అందజేస్తున్న వైస్ ఎంపీపీ భాగ్యవతి

ముంచంగిపుట్టు: ప్రభుత్వం సికిల్ సెల్ ఎనీమియా బాధితులకు అన్ని విధాలుగా అండగా ఉంటుందని వైస్ ఎంపీపీ సిరగం భాగ్యవతి అన్నారు. మండలంలో గల వనుగుమ్మ సచివాలయంలో శుక్రవారం సంగడ గ్రామానికి చెందిన బాలుడు రాజ్‌కుమార్‌కు సికిల్‌సెల్ ఎనీమియా పింఛన్ మంజూరవడంతో వైస్ ఎంపీపీ సిరగం భాగ్యవతి, సర్పంచ్ మిల్కి, ఉప సర్పంచ్ సీతారాం చేతుల మీదగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ భాగ్యవతి మాట్లాడుతూ ప్రభుత్వం సికిల్‌సెల్ ఎనీమియా బాధితులకు మెరుగైన వైద్యం అందించి, మరింత మెరుగైన అహారం తీసుకొవాలని ఉద్దేశ్యంతో నెలకు రూ.10వేలు చొప్పున పింఛన్ ద్వారా ఆర్థిక సహాయం అందిస్తుందన్నారు. ఏ ప్రభుత్వం సికిల్ సెల్ ఎనీమియా బాధితులను పట్టించుకోలేదని జగనన్న మాత్రమే వీరిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి అన్ని విధాలుగా సహాయం అందిస్తున్నారన్నారు. సచివాలయ సిబ్బంది ,గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.

తల్లిపాలతోనే బిడ్డకు ఆరోగ్యం

హుకుంపేట: తల్లిపాలతో బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని డీటీసీవో డాక్టర్ విశ్వేశ్వరనాయుడు చెప్పారు. తల్లిపాల వారోత్సవాల కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఉప్ప పాఠశాలలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. తల్లిపాల ప్రాముఖ్యత వాటి ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిడ్డలకు తల్లి పాలు అందించాలని కోరారు. ప్రతీ తల్లి ఆరు నెలల వరకు తప్పనిసరిగా పాలు పెట్టాలని తెలిపారు. ఐసీడీఎస్ సీడీపీవో బాల చంద్రమణి దేవి మాట్లాడుతూ తల్లిపాలు వారోత్సవాలు గ్రామల్లో ఈ నెల 7వ తేదీ వరకు జరుతాయన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఉప్పా వైద్యాధికారి డాక్టర్ అనీషా, సిబ్బంది, అమెరికన్ ఇండియన్ ఫౌండేషన్, మాన్సీ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

విశాఖ అథ్లెట్ జ్యోతికి కాంస్యం



కాంస్య పతకం సాధించిన జ్యోతి

విశాఖ స్పోర్ట్స్ : చైనాలో జరిగిన వరల్డ్ యూనివర్సిటీ గేమ్స్‌లో నగర అథ్లెట్ ఎర్రాజీ జ్యోతి కాంస్య పతకాన్ని సాధించింది. వుమెన్ వంద మీటర్ల హర్డిల్స్‌లో ఈ పతకాన్ని సొంతం చేసుకుంది. ఇటీవలే ఆసియన్ అథ్లెటిక్ చాంపియన్‌షిప్‌లో వంద మీటర్ల హర్డిల్స్‌లో స్వర్ణం సాధించి డబ్ల్యూజీలో పోటీపడింది. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ తరఫున ఈ పోటీల్లో పాల్గొంది.

వైఎస్సార్ అచీవ్‌మెంట్ అవార్డుకు దరఖాస్తులు

విశాఖ స్పోర్ట్స్ : రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ వైఎస్సార్ లైఫ్ అచీవ్‌మెంట్, వైఎస్సార్ అచీవ్‌మెంట్ అవార్డులకు దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. జాతీయ, అంతర్జాతీయ క్రీడా పోటీల్లో పాల్గొని విశిష్ట ప్రతిభ కనబరిచిన క్రీడాకారుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. తగిన ఆధారాలతో దరఖాస్తును ఒక పేజీకి మించకుండా చిరునామా, ఫోన్‌నంబర్, ఈ మెయిల్, ప్రతిభా వివరాలతో ఈమెయిల్‌ను sports inap@gmail.com& dsa.vsp@rediff mail లకు ఆగస్టు 20వ తేదీ సాయంత్రం ఐదు గంటలలోపు పంపుకోవాలి.

20 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత

నర్సీపట్నం: ఆటోలో తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని శుక్రవారం పోలీసులు పట్టుకున్నారు. సీఎస్‌డీటీ చందన తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలో వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా, రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న ఆటోను పట్టుకున్నారు. 20 బస్తాల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న కార్తీక్‌పై కేసు నమోదు చేశామని సీఎస్‌డీటీ తెలిపారు.

25 కిలోల గంజాయి స్వాధీనం



గంజాయి నిందితులతో సీఐ సత్యనారాయణ, ఎస్ఐ శ్రీనివాస్

జి.మాడుగుల: మండలంలో కొక్కిరాపల్లి జంక్షన్ వద్ద 25 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, ముగ్గురిని అరెస్టు చేసినట్టు సీఐ సత్యనారాయణ, ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. పాలమామిడి పంచాయతీ కొక్కిరాపల్లి జంక్షన్ వద్ద శుక్రవారం వాహనాలు తనిఖీ చేసినట్టు వారు చెప్పారు. మాకవరపాలెం పంచాయతీ వజ్రగడ గ్రామానికి చెందిన గంధం వెంకటనాగేంద్ర, తమిళనాడు రాష్ట్రానికి చెందిన సంతోష్‌కుమార్, హరిహరన్‌తో పాటు మరో ఇద్దరు కారులో 25 కిలోల గంజాయిని మైదాన ప్రాంతానికి తరలిస్తుండగా పట్టుకున్నట్టు చెప్పారు. వారిలో ముగ్గురిని అరెస్టు చేయగా, మరో ఇద్దరు పరారైనట్టు తెలిపారు. నిందితుల నుంచి గంజాయితో పాటు మూడు సెల్‌ఫోన్లు, కారు స్వాధీనం చేసుకుని, రిమాండ్‌కు తరలించినట్టు సీఐ, ఎస్ఐలు చెప్పారు.

గ్రామాల అభివృద్ధికి ప్రాధాన్యం



రచ్చబండ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీపీ శెట్టి నీలవేణి తదితరులు

అనంతగిరి: గిరిజన గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని ఎంపీపీ శెట్టి నీలవేణి అన్నారు. మండలంలోని గుమ్మ, పెదబిడ్డ గ్రామాల్లో ఆమె శుక్రవారం పర్యటించారు. ఆయా ప్రాంతాల్లో రచ్చబండ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ నీలవేణి మాట్లాడుతూ గతంలో రచ్చబండ నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలని విశాఖ ఉమ్మడి జిల్లాల జెడ్పీ చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్రను కలిసి కోరామన్నారు. నిధులు మంజూరు చేయడంతో రచ్చబండల నిర్మాణానికి శ్రీకారం చుట్టమన్నారు. మండలంలో గల పెదబిడ్డ ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలను ఎంపీపీ నీలవేణి సందర్శించారు.విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. మెరుగైన విద్య ప్రమాణాలు పాటిస్తూ విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించాలని ఉపాధ్యాయులను సూచించారు.పాఠశాల భోజనశాల అపరిశుభ్రంగా ఉండడంతో ఎంపీపీ ఆగ్రహం వ్యక్తం చేశారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. సర్పంచ్ పెట్టామ్మ, నాయకలు కృష్ణమూర్తి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

లిఫ్ట్ అడిగిన మహిళ నగలతో ఉడాయింపు



బాధితురాలు

నక్కపల్లి: ఓ మహిళ లిఫ్ట్ అడిగిన పాపానికి బెదిరించి ఆమె మెడలో బంగారం వస్తువులు ఎత్తుకుపోయిన సంఘటన శుక్రవారం ఉద్దండపురం సమీపంలో జరిగింది. రమణయ్యపేటకు చెందిన కర్రి వరలక్ష్మి కొద్దికాలం నుంచి పాయకరావుపేటలో నివాసముంటోంది. డ్వాక్రా పని మీద కొడుకుతో కలిసి ఉద్దండపురం వరకు వచ్చింది. అక్కడ నుంచి రమణయ్యపేట వెళ్లేందుకు అటుగా వెళ్తున్న ఒక వ్యక్తిని బైక్ లిఫ్ట్ అడిగింది. వెంటనే అతను బైక్ ఎక్కించుకొని ఉద్దండపురం దాటగానే బెదిరించి ఆమె శరీరంపై ఉన్న బంగారం లాక్కోవడానికి ప్రయత్నించాడు. ఈమె ప్రతిఘటించడంతో బలవంతంగా రెండు తులాల పుస్తెల తాడు, తులం తాడు పట్టుకుని పరారయ్యాడు. దాంతో బాధితురాలు లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయించింది. ఆమె ఫిర్యాదు మేరకు ఎస్ఐ శిరీష కేసు నమోదు చేశారు. నిందితుల కోసం సీసీటీవీ ఫుటేజీ ద్వారా గాలిస్తున్నారు.

గడ్డపారతో దాడి చేసిన మహిళ అరెస్ట్



దాడిలో గాయపడిన చినతల్లి

మాకవరపాలెం: మహిళపై దాడి చేసిన మరో మహిళను అరెస్టు చేశామని ఎస్ఐ రామకృష్ణారావు తెలిపారు. మండలంలోని బయ్యవరంలో రెండు కుటుంబాల మధ్య తగాదాలున్నాయన్నారు. ఈ నేపథ్యంలో గ్రామానికి చెందిన లాలం చినతల్లి(58)ని ఇదే గ్రామస్తురాలు లాలం లక్ష్మి(45) గడ్డపారతో తలపై తీవ్రంగా గాయపరిచిందని తెలిపారు. దీంతో బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి లక్ష్మిని అరెస్టు చేసినట్టు ఎస్ఐ శుక్రవారం తెలిపారు. బాధితురాలు ఆస్పత్రిలో చికిత్స పొందుతుందన్నారు.

పురుగుల మందు తాగి గీత కార్మికుడి ఆత్మహత్య

యలమంచిలి: మండలంలోని పులపర్తి గ్రామానికి చెందిన గీత కార్మికుడు దమ్ము అప్పారావు (37) అనారోగ్యం, ఆర్థిక ఇబ్బందులతో క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. రూరల్ ఎస్సై సన్నిబాబు వివరాల ప్రకారం... గురువారం సాయంత్రం తన ఇంట్లో వ్యవసాయ పనులకు ఉపయోగించే క్రిమిసంహారక మందు తాగాడు. దీన్ని గమనించిన కుటుంబ సభ్యులు నక్కపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స చేసి కేజీహెచ్‌కు తరలించగా, చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ శుక్రవారం తెలిపారు.